'వనం'.. జల గరళం

కాలుష్యకాసారంగా వనం చెరువు

- మృత్యువాత పడుతున్న చేపలు
- అలుగు మళ్లింపుతో రైల్వే ట్రాక్‌కు ముప్పు!
- పట్టించుకోని అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన వనం చెరువు నేడు కాలుష్యంతో కొట్టుమిట్టాడుతోంది. ఈ చెరువుపై అనేక మత్స్యకార కుటుంబాలు ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. పల్లెలు పట్టణాలుగా మారుతున్న క్రమంలో చెరువులు మురికి కుంటలుగా మారుతున్నాయి. తెల్లాపూర్‌లోని వనం చెరువు సుమారు 20 ఎకరాలు ఉంటుంది. గతంలో ఈ చెరువు కింద వందలాది ఎకరాల్లో సాగు జరిగేది. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి.

తెల్లాపూర్ శివారు ప్రాంతంలోని నల్లగండ్ల ప్రాంతం నుంచి డ్రైనేజీ నీరు చెరువుల్లోకి చేరుతుండటంతో చెరువులు పూర్తిగా కలుషితమవుతున్నాయి. గతంలో ట్యాంకర్లతో వ్యర్థాలు తీసుకొచ్చి చెరువుల్లోకి వదిలారు. ఆ సమయంలో స్థానికులు పట్టుకోవడంతో సమస్య పరిష్కారమైనప్పటికీ మురుగునీటి ప్రవాహం మాత్రం ఆగడం లేదు.

సమన్వయ లోపం.. చెరువుకు శాపం

- ఈ చెరువుపై ఆధారపడి సుమారు 50 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. చెరువును పరిరక్షించాల్సిన అధికారుల సమన్వయ లోపంతో చెరువుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెరువులను కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో కలుషిత కాసారాలుగా మారుతున్నాయి.


మృత్యువాత పడిన చేపలు

- వనం చెరువులో మురుగునీరు పెద్ద ఎత్తున చేరడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సైతం చెరువులో వదిలిన చేపలు కాలుష్యం కారణంగా చనిపోయాయి. సుమారు టన్ను వరకు పెద్ద చేపలు చెరువులో ఉండొచ్చని అంచనా. ఐదు నెలల క్రితం ప్రభుత్వం సుమారు లక్ష చేప పిల్లలను చెరువులోకి వదిలింది. మురుగు నీరు చేరడంతో ఆక్సిజన్ అందక చేపలు మృతి చెందుతున్నాయి. చేపలు మృతి చెందుతున్నాయని, ప్రభుత్వమే ఆదుకోవాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.
- తెల్లాపూర్‌లోని వనం చెరువు వద్దకు విదేశాల నుంచి పక్షులు వలస వస్తున్నాయి. సైబీరియన్ పక్షులు ఇప్పటికే వనం చెరువుకు చేరుకున్నాయి. మురుగు నీటితో వాటి ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే ట్రాక్ వైపు నీటి మళ్లింపు

మురుగు నీటితో వనం చెరువు అలుగు పారడంతో వాటిని దారి మళ్లించారు. చెరువు అలుగు వెళ్లే ప్రాంతాల్లో వెంచర్లు రావడంతో ఆ నీటిని ఎవరు మళ్లించారో కానీ దానివల్ల రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్టను ఆనుకొని రేడియల్ రోడ్డును అభివృద్ధి చేశారు. చెరువును ఆనుకొని పెద్ద కల్వర్టు నిర్మించారు. కాగా చెరువు నీటిని కల్వర్టు నుంచి బయటకు పోయేవిధంగా కాల్వ చేశారు. దీంతో వనం చెరువులోని మురుగు నీరు రైల్వే ట్రాక్ పక్కన పెద్ద ఎత్తున నీరు నిలుస్తోంది. దీంతో రైల్వే ట్రాక్ కింద ఉండే మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని అధికారులు గమనించకపోవడం ఆశ్చర్యకరం.


కల్వర్టు కింద నుంచి రైల్వే ట్రాక్ వైపు వెళ్తున్న చెరువు నీరు



అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వనం చెరువులోకి మురుగు నీరు వస్తోంది. చర్యలు తీసుకోవాలని కోరుతూ గతంలో మున్సిపల్ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశాం. – సంతోషిని, ఇరిగేషన్ ఏఈ

ప్రభుత్వమే ఆదుకోవాలి



వనం చెరువులోకి పెద్ద ఎత్తున మురుగునీరు రావడంతో చేపలకు ఆక్సిజన్ అందక మృతి చెందుతున్నాయి. చెరువులో సుమారు ఒక టన్ను పెద్ద చేపలు ఉన్నాయి. కాలుష్యంతో అవి మృతి చెందుతున్నాయి. చెరువు కాలుష్యంపై గతంలో అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. ప్రభుత్వమే మత్స్యకారులను ఆదుకోవాలి.
– బలరాం, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు

మినీ ప్లాంట్ ఏర్పాటుకు కృషి



చెరువులోకి వచ్చే మురుగు నీటిని ముందస్తుగానే శుద్ధి చేసేందుకు మినీ మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. మురుగు నీరు చెరువులోకి రాకముందే శుద్ధి చేయడం వల్ల ఎలాంటి ముప్పు ఉండదు. త్వరలో ఈ ప్రతిపాదనను జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – శ్రీనివాస్, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: దీప్తిశ్రీనగర్, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, శాంతినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దీప్తిశ్రీనగర్ ఫీడర్ పరిధిలోని మియాపూర్ పోలీస్‌స్టేషన్ మీదుగా మదీనాగూడ మెయిన్‌రోడ్డు, విశ్వేశ్వరయ్య కాలనీ, ఫార్చ్యూన్ హైట్ అపార్ట్‌మెంట్, సాయినగర్ కాలనీ, కృష్ణ దేవర కాలనీ, క్రోమో బిల్డింగ్.

సత్యనారాయణ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు.. దీప్తిశ్రీనగర్ , ఇక్రిశాట్ కాలనీ, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, అదేవిధంగా 4 గంటల నుండి 5:30 వరకు శాంతినగర్ ఫీడర్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ రోడ్డు– 14, ధర్మపురి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

నానక్‌రాంగూడ ఫీడర్ పరిధిలో..

గచ్చిబౌలి: నానక్‌రాంగూడ ఫీడర్ పరిధిలో.. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రశాంతిహిల్స్, రాయదుర్గం పీఎస్, రాయదుర్గం, మధురానగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

రేపు అల్లాడి మెమోరియల్ లెక్చర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అల్లాడి మెమోరియల్ ట్రస్ట్, సెంటర్ ఫర్ హ్యూమన్‌రైట్స్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆఫ్ హెచ్‌సీయూ సంయుక్త ఆధ్వర్యంలో అల్లాడి మెమోరియల్ లెక్చర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తారు.75 సంవత్సరాల భారతీయ న్యాయవ్యవస్థ దాని స్వాతంత్ర్యం, సమర్థతపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జే చలమేశ్వర్ ఉపన్యసిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు హెచ్‌సీయూలోని జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో నల్సార్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు అధ్యక్షత వహిస్తారు.

పగలు.. వెలుగులు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీ– తెల్లాపూర్ ప్రధానరోడ్డులో స్ట్రీట్ లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. మంగళవారం నల్లగండ్ల హుడా కాలనీ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నా జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పట్టనట్లే వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో రంగారెడ్డి జిల్లా క్రీడాకారుల సత్తా

మియాపూర్: నాల్గవ జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో సత్తాచాటిన రంగారెడ్డి జిల్లా క్రీడాకారులను మంగళవారం మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ... ఫిబ్రవరి 16 నుండి 19 వరకు హర్యానా రాష్ట్రంలో కురుక్షేత్ర ద్రోణాచార్య స్టేడియంలో జరిగిన పోటీల్లో రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు 3 బంగారు, నాలుగు రజతం, మూడు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఈ పోటీల్లో 2వేల మంది క్రీడాకారులు పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం నుండి 150 మంది పాల్గొని వంద పతకాలకు పైగా సాధించారని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ఈ సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...ఆది, సోమవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 31 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 28 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. ఒకరికి రూ.3 వేలు, మరో ఇద్దరికి రూ.5 వేలు విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: రేణుక ఎల్లమ్మ జాతరకు రావాలంటూ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వర్ గౌడ్ మంగళవారం గవర్నర్ వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి 26వ తేదీన జరిగే జాతరకు రావాలంటూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలిలో మంగళవారం శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భిక్షపతి యాదవ్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ప్రస్తుతం సమస్యలు తాండవిస్తున్నాయని, ప్రజలకు తామే అండగా ఉంటామని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోదీ పాలనను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షుడు రాజు శెట్టి, నాయకులు ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, రమేష్, జైహింద్, భరత్, యాదయ్య, లింగం పాల్గొన్నారు.


గచ్చిబౌలిలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

చందానగర్ డివిజన్‌లో..

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్ పరిధిలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రాల కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ..శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమస్యలు,అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉందని,సమస్యలు పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులు,కార్పొరేటర్లు, ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో శక్తికేంద్రాల ఇంచార్జి కసిరెడ్డి రఘునాథ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, కసిరెడ్డి సింధూరెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాంరెడ్డి, శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, శివకుమార్ వర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నిథమ్'లో దస్తకారి హాత్ క్రాఫ్ట్ బజార్

రాయదుర్గం: నిథమ్‌లో 'దస్తకారి హాత్ క్రాఫ్ట్ బజార్'ను మంగళవారం డైరెక్టర్ డాక్టర్ ఎస్ చిన్నంరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈనెల 28వ తేదీ వరకు రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతివృత్తులను ప్రోత్సహించాలనే తపనతో క్రాఫ్ట్ బజార్‌ను నిథమ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేయడానికి అనుమతించామన్నారు. కాగా సందర్శకుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రవేశం ఉచితం.



సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ అసోసియేషన్ నాయకులు, స్థానికులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో, కమల ప్రసన్ననగర్, వెంకటేశ్వరనగర్ వీకర్ సెక్షన్ కాలనీ, మాధవరం నగర్ బీ,సీ బ్లాక్ కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీల్లో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసుల కోరిక మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో ప్రశాంత వాతావరణం కల్పిస్తామని, మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు పాల్గొన్నారు.

మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు విజయలక్ష్మి తదితరులు

మాదాపూర్: మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించగలిగితే అన్యభాషలు సులువుగా ఉంటాయని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు దేవారెడ్డి విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మాదాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంను నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన భావాలను ఎదుటి వారికి అర్థమయ్యే రీతిలో వ్యక్తపరచడానికి మాతృభాష సులువుగా ఉంటుందన్నారు. మాతృభాష గొప్పతనాన్ని గుర్చి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవలింగం, అధ్యాపకులు జీఎం స్వామి, జి.కిష్టయ్య, విద్యార్థులు, అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, కొండిన్యశ్రీ నండూరి వేంకటేశ్వరరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఇప్పిస్తా.. ఓడిస్తా

మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్‌పై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ బీజేపీ టికెట్ నందీశ్వర్‌గౌడ్‌కు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను బతిమాలుతానని, అవసరమైతే బీఆర్‌ఎస్ నుంచి సామాన్య కార్యకర్తను నిలబెట్టి నందీశ్వర్‌పై భారీ మెజారిటీతో గెలిపించుకుంటా అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సవాల్ చేశారు. మంగళవారం జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయాల్లో విలువలను మంటగలుపుతున్నాడని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ నుంచి నందీశ్వర్‌కు టికెట్ కేటాయిస్తే ఆయనను మరోసారి ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నందీశ్వర్ కొడుకుపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, నందీశ్వర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనేక అక్రమాలకు పాల్పడ్డాడని ఎమ్మెల్యే ఘాటైన విమర్శలు చేశారు. రామాలయం భూములు అన్యాక్రాంతం కాలేదని వాటిపై అనవసరంగా నోరు పారేసుకోవద్దని ఎమ్మెల్యే హెచ్చరించారు. తాను రెండు వేల కోట్ల రూపాయలు ఆస్తిని సంపాదించానని ఆరోపిస్తున్న నందీశ్వర్ వాటిని ఆధారాలతో నిరూపిస్తే . 'ఉన్న ఊరును, ఇంటిని వదిలేసి వెళ్తా!.. అందుకు నువ్వు రెడీనా' అని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

గోల్ఫ్‌లో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల, ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు గోల్ఫ్‌లో సత్తా చాటారు. మహారాష్ట్రలోని కోర్గులో జరిగిన సాత్‌జోన్ జాతీయ గోల్ఫ్ పోటీల్లో 14 మంది క్రీడాకారులు 14 మెడల్స్‌ను సాధించారు. మంగళవారం కళాశాలకు చేరుకున్న క్రీడాకారులను ప్రిన్సిపల్ పాపారావు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణేష్, వ్యాయామ ఉపాధ్యాయులు కె సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య

మాదాపూర్: ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన సంఘటనల వివరాలిలా.. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని సాయినగర్‌లో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న రాజేశ్(29) లా గ్రాడ్యుయేషన్ చేశాడు. వ్యక్తిగత కారణాలతో ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తండ్రి శరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొండాపూర్‌లో..

గచ్చిబౌలి: అప్పు చెల్లించాలని లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. వైజాగ్‌కు చెందిన ఎస్. సుదేష్(24) ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వచ్చి పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం కొండాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీ సీ బ్లాక్‌లో బాలాగౌడ్ నిలయంలోకి మకాం మార్చాడు. ఈ క్రమంలో సుదేష్ సోదరుడు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో అతని ఫ్రెండ్స్‌కు సమాచారం అందించాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో స్నేహితులు వచ్చి చూడగా ఫ్లాట్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు రావాల్సి ఉందని, ఫిర్యాదు చేసిన అనంతరం కేసు నమోదు చేస్తామని సీఐ సురేష్ తెలిపారు. సుదేష్ లోన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నట్లు తెలుస్తోందని, అప్పు తీర్చాలని ఒత్తిడి చేయడంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

జాతీయ రహదారిపై డీసీఎం దగ్ధం

రోడ్డు పక్కన నిలిపిన కారుకు అంటుకున్న మంటలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పట్టణంలోని బీరంగూడ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఓ డీసీఎం దగ్ధమైంది. ఆ మంటలు రోడ్డు పక్కన నిలిపిన కారుకు కూడా అంటుకొని అది కూడా పూర్తిగా కాలిపోయింది. వివరాల్లోకి వెళితే.. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం నుంచి డీసీఎం లోడ్ చేసుకొని బాలానగర్‌కు వెళుతుండగా బీరంగూడ కమాన్ సమీపంలోకి రాగానే డీసీఎం ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయి. బండిని పక్కకు నిలిపి డ్రైవర్ కిందకు దిగాడు. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. పక్కనే ఉన్న కారు సైతం అంటుకోవడంతో అది కూడా పూర్తిగా దగ్ధమైంది. సంఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేసింది. అక్కడే ఉన్న డీసీఎం డ్రైవర్ వినోద్ రాయ్ పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. పాశ మైలారం నుంచి బాలానగర్ వెళుతున్నట్లు చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. డీసీఎంలోని డ్రమ్ముల్లో ఏముందన్న విషయం తెలియలేదు. కొందరు ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ ఉందని చెబుతుండగా, మరికొందరు కెమికల్ పదార్థాలు ఉండొచ్చని భావిస్తున్నారు. మంగళవారం రాత్రి వరకు డీసీఎం యజమాని రాకపోవడంతో పలు అనుమానాలు వస్తున్నాయి. కాగా దగ్ధమైన కారు యాజమాని సికింద్రాబాద్ నివాసి గౌరీచరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బంధువులను కలవడానికి బీరంగూడ వద్దకు వచ్చానని, బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేలోపల కారు దగ్ధమైందన్నాడు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

డీసీఎంలో మంటలు రావడంతో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



షార్ట్‌సర్క్యూట్.. కాలి బూడిదైన సామగ్రి



గచ్చిబౌలి: గచ్చిబౌలి విలేజ్‌లో ఓ ఇంట్లో విద్యుదాఘతంతో మంటలు రేగి ఇంట్లోని సామగ్రి కాలి బూడిదైంది. ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగింది. వివరాలిలా.. గచ్చిబౌలి విలేజ్‌లో నివాసం ఉండే నరేష్ సింగ్ అదే గ్రామంలోని సోదరుడు నందుసింగ్ కూతురు పెళ్లికి వెళ్లారు.ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 3.50 గంటల సమయంలో బెడ్ రూమ్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు రేగాయి. దీంతో అక్కడున్న పిల్లలు బయటకు పరుగులు తీసి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకోగా రోడ్డు ఇరుకుగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టేందుకు గంట ఆలస్యమైంది. పెళ్లికి తెచ్చుకున్న బట్టలు, సామగ్రి కాలిబూడిదైందని నందుసింగ్ తెలిపారు. ఎట్టకేలకు మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, పట్టినాగులపల్లి ఫైర్ ఆఫీస్ జగన్ ఆధ్వర్యంలో సమీపంలోని ఓ సైట్ నుంచి వాటర్ ట్యాంకర్ తీసుకొచ్చి మంటలు ఆర్పారు.